క్లుప్తంగా

తైక్వాండో క్రీడాకారిణికి అభినందనలు



చీరాల రూరల్: ఖేలో ఇండియా తైక్వాండో పోటీలలో బ్రాంజ్ మెడల్ సాధించిన క్రీడాకారిణిని ఎమ్మెల్యే కరణం, నియోజకవర్గ సమన్వయకర్త వెంకటేష్ అభినందించారు. ఖేలో ఇండియా తైక్వాండో పోటీలు ఫిబ్రవరి 27 నుంచి మార్చి 1వ తేది వరకు పాండిచ్చేరి రాష్ట్రంలో నిర్వహించారు. 73 బరువుల విభాగంలో వినిత మూడో స్థానంలో నిలిచి బ్రాంజ్ మెడల్‌ను కైవసం చేసుకుంది. ఒడిశాలోని భవనేశ్వర్‌లో ఈనెల 10 నుంచి 12వ తేదీ వరకు జరిగే చివరిదశ తైక్వాండో జాతీయ లీగ్ పోటీలకు ఎంపికయ్యింది. ఈసందర్భంగా ఎమ్మెల్యే, సమన్వయకర్తలు వినితను సత్కరించారు. ఏపీ తైక్వాండో కోశాధికారి ఎస్‌కె. అబ్దుల్ సలాం, ఎస్‌ఏఐ తైక్వాండో కోచ్ వితల్‌లు అభినందించారు.

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు



మేదరమెట్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లలాంటివని అందుకే ప్రజలు తిరిగి జగనన్నను ముఖ్యమంత్రి చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నారని అద్దంకి నియోజకవర్గం వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి అన్నారు. కొరిశపాడు మండలంలోని పీ.గుడిపాడు గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు గురువారం ఆయన ప్రారంభోత్సవాలు చేశారు. కార్యక్రమంలో భాగంగా నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రంతో పాటు కాపు కల్యాణ మండపాన్ని హనిమిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు హనిమిరెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల, గ్రామ నాయకులు, సచివాయం ఉద్యోగులు, వలంటీర్లు, పార్టీ కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

సమన్వయంతో సమగ్రాభివృద్ధి

యద్దనపూడి: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మండల సమగ్రాభివృద్ధికి తోడ్పడాలని ఎంపీపీ పులగం రజనీ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ శివసుబ్రమణ్యం అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు తమ శాఖల పరిధిలోని అభివృద్ధి పథకాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రానున్నది వేసవికాలం దృష్ట్యా పంచాయతీ కార్యదర్శులు తాగునీటిని వృథా కాకుండా చూడాలని సాగర్‌జలాలు వచ్చేలోపు మంచి నీటి చెరువులను చుట్టూ ఉన్న చిల్లచెట్లను తొలగించి చెరువులను పూర్తిస్థాయిలో నింపాలన్నారు. వ్యవసాయాధికారి చల్లగుండ్ల ఆది నారాయణ మాట్లాడుతూ ఇన్‌పుట్ సబ్సిడీ కింద ప్రభుత్వం 2.26 కోట్లు నగదు రైతులఖాతాల్లో జమచేశామన్నారు. ఏపీఎం వెంకట్రావు మాట్లాడుతూ డ్వాక్రా రుణమాఫీ కొరకు 4 విడతల్లో 621 గ్రూపులకు రూ.21 కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో జమచేశామని చెప్పారు. కార్యక్రమంలో కార్యక్రమంలో తహశీల్దారు నాగరాజు, ఈఓఆర్డీ శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీలు ఐమాల శ్యాంసన్ అధికారులు, సర్పంచ్‌లు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



చీరాల గంజిపాలెంలోని శివాలయం



ఈపూరుపాలెం శివాలయంలోని శివలింగం ఎడమ చేతి పక్కన అమ్మవారి విగ్రహం



కారంచేడులో పూల అలంకరణకు సిద్ధం చేస్తున్న భక్తులు

మహాశివరాత్రికి ముస్తాబైన శైవక్షేత్రాలు

- నేడు మహాశివరాత్రి
- కిటకిటలాడనున్న శైవక్షేత్రాలు

చీరాల అర్బన్: మహాశివరాత్రి వేడుకలకు శైవక్షేత్రాలు ముస్తాబయ్యాయి. శుక్రవారం మహాశివరాత్రి సందర్భంగా పేరాలలోని పునుగు రామలింగేశ్వరస్వామి దేవాలయం, చీరాల గంజిపాలెంలోని శివాలయం, అలానే ఈపూరుపాలెం, వేటపాలెంలోని శైవక్షేత్రాలు ఎంతో చారిత్రాత్మకమైనవి. శివరాత్రిని పురస్కరించుకొని ఆలయాలకు రంగులు వేసి విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. చీరాల గంజిపాలెం ప్రాంతంలో నిర్మితమైన చీరాల శివాలయాన్ని గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవాలయం 500 సంవత్సరాల చరిత్రను పుణికి పుచ్చుకుంది. ఈ దేవాలయాన్ని రాణిరుద్రమాంబ వంశస్తులు నిర్మించినట్లు చెబుతారు. ఈ దేవాలయాన్ని 2000లో పునరుద్ధరించారు. ఈ దేవాలయంలో కార్తీకమాసంలో పదిహేను రోజుల పాటు సూర్య కిరణాలు స్వామి వారి మీద ప్రసరిస్తాయి. అలానే ఇక్కడ ఆరుద్ర నక్షత్రం సందర్భంగా నటరాజస్వామి ఉయ్యాల ఉత్సవం ఘనంగా నిర్వహిస్తారు. ఈ ఉత్సవం తమిళనాడులోని చిదంబరం తర్వాత ఇక్కడ మాత్రమే నిర్వహించడం విశేషం. మహాశివరాత్రిని పురస్కరించుకుని కోటప్పకొండ, చిన్నగంజాం ప్రాంతాలకు చీరాల ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. కోటప్పకొండకు 45 బస్సులు, చిన్నగంజాం సోపిరాలకు 4 బస్సులను నడుపుతున్నారు. ప్రతి 10 నిమిషాలకు ఒక బస్సును ఏర్పాటు చేశారు.

శివరాత్రి తిరునాళ్లకు భారీగా ఏర్పాట్లు

కారంచేడు/చినగంజాం: మండల కేంద్రం కారంచేడు పెదబజారు శివాలయంలో గంగా భ్రమరాంబసమేత మల్లేశ్వరస్వామి పంచామృతాభిషేకాలు, శివనామ సంకీర్తనలు, విశేష పూలాలంకరణ, 32 రకాలతో లింగోద్భవ పూజలు నిర్వహిస్తామని ఆలయ అర్చకులు తెలిపారు. స్వర్ణ శివాలయంలోను ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు చేస్తున్నారు.

- శివరాత్రి తిరునాళ్లను పురస్కరించుకొని మండలంలోని చినగంజాం, కొత్తపాలెం పరిధిలో లలితా పరమేశ్వరీ సమేత రామకోటేశ్వరాలయం, బాలకోటేశ్వరాలయంలో నిర్వాహకులు భారీ ఎర్పాట్లు చేశారు. రెండు దేవాలయాల వద్ద తిరునాళ్లను శుక్రవారం పోటాపోటీగా నిర్వహించేందుకు భారీ హంగులతో విద్యుత్ దీప కాంతులు ప్రభలు, భారీ కటౌట్‌లను, వివధ సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నారు. 120 అడుగుల పైగా ఎత్తు ఉండే విధంగా మూడు డిజిటల్ విద్యుత్ ప్రభలు, దాంతో పాటు ఆలయ ప్రాంగణం చుట్టూ శివపార్వతులు, అయ్యప్ప, విఘ్నేశ్వరుడు, కనకదుర్గా భవానీతో పాటు వివిధ దేవతా మూర్తుల భారీ విద్యుత్ కటౌట్‌లను ఏర్పాటు చేస్తున్నారు. ఆలయ ప్రాంగణంలో కొరియోగ్రాఫర్ సుదర్శన్ మాస్టర్ టీం, యాంకర్ అమూల్య, టీవీ డ్యాన్స్ ప్రోగ్రాంలలో విన్నర్స్‌గా నిలిచిన బృందాలతో గుంటూరు కారం ఫేం యాంకర్ హరిత, ఈవెంట్ ఆర్గనైజర్ వీరు బాల ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలను, లలితా రామకోటేశ్వర మహిళ కోలాట భజన బృందంతో కోలాటలను, సత్యహరిశ్చంద్ర నాటకాలను ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేశారు.కొత్తపాలెం బాలకోటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో సుమారు 5కు పైగా 120 అడుగుల ఎత్తులో భారీ విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేయనున్నారు.

చినగంజాం, కొత్తపాలెం పంచాయతీలలో వేంచేసియున్న రెండు శివాలయాలకు శివరాత్రి పండుగను పురస్కరించుకొని సుమారు 80 వేల నుంచి 1 లక్ష మంది వరకు భక్తులు రానున్నట్లుగా అంచనా వేశారు. అందుకు తగినట్లుగా రెండు దేవాలయాల నిర్వాహకులు, పోలీసులు తమ ఏర్పాట్లను చేస్తున్నారు. చీరాల డీఎస్పీ బేతపూడి ప్రసాద్ ఆధ్వర్యంలో సుమారు 150 మందికి పైగా పోలీసు సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. వీరితో పాటు ఆరోగ్య శాఖ వారు ప్రత్యేకవైద్యశిబిరాలను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేశారు.



విద్యుత్ దీపాలతో అలంకరించిన పేరాలలోని శివాలయం

దక్షిణకాశి మణికేశ్వరం..

అద్దంకి: దక్షిణ కాశిగాపేరు గాంచిన మణికేశ్వరంలోని మల్లీశ్వర స్వామి దేవస్థానం మహాశివరాత్రి వేడుకలకు ముస్తాబైంది. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చే భక్తుల కోసం ఆలయంలో ప్రత్యేక క్యూలైన్లు, పక్కనే ఉన్న గుండ్లకమ్మ నది వద్ద స్నాన ఘట్టాలు ఏర్పాటు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా దేవాదాయ శాఖ, కమిటీ ఆధ్వర్యంలో పర్యవేక్షణ చేయనున్నారు. మహాశివరాత్రి పర్వదిన సందర్భంగా 8వ తేదీ రాత్రి లింగోద్భవ సమయంలో మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, ఉదయం నుంచి అభిషేకాలు, అన్నదానం చేయనున్నట్లు తెలిపారు.

బల్లికురవ: మండలంలోని చెన్నుపల్లి కొండాయపాలెం, నక్కబొక్కలపాడు, ఉప్పుమాగులూరు, వేమవరం, కొణిదెన, గుంటుపల్లి, అంబడిపూడి, కొమ్మినేనివారిపాలెం, ముక్తేశ్వరం, సూరేపల్లి, కొప్పరపాడు, వైదన, గ్రామాల్లోని శివాలయాల్లో ఉదయం 5 గంటల నుంచే శివునికి మహన్యాసపూర్వక ఏకవార రుద్రాభిషేకాలు ప్రత్యేక అలంకరణ, అమ్మవారికి కుంకమ పూజలు రాత్రికి లింగోద్భవ కాలంలో తిరిగి అభిషేకాలు అలంకరణ, భజనలు, చేపట్టనున్నట్లు అలయ కమిటి అర్చకులు తెలిపారు. చినగంజాంలోని బాలకోటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో నారాయణ ప్రభను బుధవారం రాత్రి చేర్చారు. ఆనవాయితీ ప్రకారం ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా నారాయణ ప్రభను కోకి వంశస్తులు ఊరేగింపుగా ప్రభను తీసుకొని వచ్చి బాలకోటేశ్వర స్వామి ఆలయం ఎదుట తొలి పూజకు ఉంచారు.

పూజలు చేయనున్న ముఖ్య అతిథులు..

మహాశిరాత్రి రోజున వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి రాజగోపురం రెండో అంతస్తుకు శంకుస్థాపన చేస్తారు. దేవస్థానానికి దక్షిణ, తూర్పు వైపు ప్రహరీకు చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకష్ణమూర్తి, పురాణ కాలక్షేప మండపాన్ని మాజీ ఏఎంసీ చైర్మన్ వైవీ భద్రారెడ్డి ప్రారంభించనున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చీరాల నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కరణం వెంకటేశ్, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి కుమారుడు ప్రణీత్‌రెడ్డి, హాజరౌతున్నట్లు కమిటీ అధ్యక్షులు ఈదా విజయలక్ష్మీ శ్రీనివాసరావు, కార్యదర్శి సీహెచ్ కష్టారెడ్డి తెలిపారు.



రామకోటేశ్వరస్వామి ఆలయం వద్ద నిర్వహిస్తున్న ఏర్పాట్లు



అద్దంకి: మణికేశ్వర దేవాలయం



బల్లికురవ: విద్యుత్ దీపాలతో అలంకరించిన శివాలయాలు

గ్రామ స్వరాజ్య స్థాపనే ముఖ్య లక్ష్యం



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కరణం



సంక్షేమ కరపత్రం అందిస్తున్న సమన్వయకర్త కరణం వెంకటేష్

- అభివృద్ధి పనుల ప్రారంభంలో ఎమ్మెల్యే కరణం, సమన్వయకర్త వెంకటేష్

చీరాల టౌన్: చేనేతలు, వ్యవసాయదారులు, శ్రామికవర్గం అధికంగా ఉన్న చీరాల నియోజకవర్గాన్ని అన్నీ రంగాల్లో అభివృద్ధిలో ముందంజలో నింపేందుకు ప్రత్యేకంగా కృషి చేశామని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, నియోజకవర్గ సమన్వయకర్త కరణం వెంకటేష్‌లు తెలిపారు. గురువారం రాత్రి మండలంలోని దేవాంగపురి గ్రామ పంచాయితీలో రూ.40 లక్షలతో నూతనంగా నిర్మించిన దేవాంగపురి-2 సచివాలయం, రూ.22 లక్షలతో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రం ప్రారంభోత్సవాన్ని పండితుల మంత్రోచ్ఛరణలతో పండుగలా నిర్వహించారు. అలానే గడిచిన ఐదేళ్లలో దేవాంగపురి గ్రామ పంచాయతీలో రూ.7.41 కోట్లతో చేసిన అభివృద్ధి పనుల శిలాఫలకాలను ఎమ్మెల్యే, వెంకటేష్‌లు ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే బలరాం మాట్లాడుతూ నియోజకవర్గంలోని గ్రామ పంచాయితీలు, శివారు కాలనీల్లో నివశించే ప్రజలకు సైతం మౌలిక వసతులు కల్పించేందుకు ప్రణాళికాబద్ధంగా పనిచేశామన్నారు. అభివృద్ధి పనుల్లో రాజీ లేకుండా ప్రజలకు అన్నీ విధాలుగా అండగా నిలిచి ప్రభుత్వ సహకారం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చొరవతో మోడల్ నియోజకవర్గాన్ని రూపాంతరం చేశామన్నారు. సమన్వయకర్త కరణం వెంకటేష్ మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు కావాల్సిన అన్నీ వసతులు, అభివృద్ధి పనులను సత్వరమే పూర్తి చేసి జిల్లాలో చీరాల నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దామన్నారు. తన తండ్రి ఆలోచన, సీఎం జగనన్న సహకారంతో చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలన్నింటిని పరిష్కరించామన్నారు. అమలు కాని, అసంబద్ధ హామీలను ఇచ్చే ప్రతిపక్ష పార్టీల కల్లబొల్లి మాటలను ప్రజలు నమ్మవద్దన్నారు. ఎల్లప్పుడు అందుబాటులో ఉండే కరణం కుటుంబాన్ని ఎన్నికల్లో ఆదరించి గెలిపించాలని వెంకటేష్ కోరారు. అనంతరం ఎమ్మెల్యే బలరాం, వెంకటేష్‌లను పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శోభారాణి, మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, కార్పొరేషన్ డైరెక్టర్ జి.శ్రీనివాసరావు, పిఆర్ డిఈ శేషయ్య, ఏపీఎం సుబ్బారావు, మండల పార్టీ అధ్యక్షులు ఎ.అంకాలరెడ్డి, పిఏసిఎస్ చైర్మన్ బోయిన కేశవులు, ఆర్‌బికె చైర్మన్ కె.రమణారెడ్డి, పార్టీ నాయకులు. దనుంజయ్, అద్దంకిరెడ్డి, వెంకటేశ్వరమ్మ, బి.శివపార్వతి, కె.శ్రీనివాసరావు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారధులు, వాలంటీర్లు, ప్రజలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న సమన్వయకర్త బాలాజీ

యద్దనపూడి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని వైఎస్సార్ సీపీ పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త యడం బాలాజీ పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని పూనూరు గ్రామంలో వైఎస్సార్ సీపీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. తొలుత గ్రామసెంటర్‌లో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్సీకాలనీలో చర్చిలో ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ మేకా సుధాకర్, బొబ్బేపల్లి శ్రీకాంత్, దుగ్గినేని కోటేశ్వరావు, ఎండ్లూరి సబ్బిసాహెబ్, కంచర్ల గోపయ్య, మేకా అక్కయ్య, రత్నకుమార్, బేతపూడి అంజియ్య, అయ్యప్పఖాన్, తిరుమలశెట్టి రామకృష్ణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



హాజరైన ప్రజలు

అన్ని రంగాల్లో స్త్రీలదే హవా



కొరిశపాడు మండల కార్యాలయంలో మహిళా ఉద్యోగులను సన్మానించిన దృశ్యం



నందిగుంటపాలెంలో మహిళా ఉపాధ్యాయులను సత్కరించిన విద్యార్థులు



వాడరేవులో మహిళా ఉపాధ్యాయులను సత్కరిస్తున్న సహచరులు

- ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

చీరాల అర్బన్/చీరాల రూరల్: ప్రస్తుత సమాజంలో అన్ని రంగాల్లో స్త్రీలతే హవా కొనసాగుతోందని సీనియర్ సివిల్‌జడ్జి ఎం. సుధ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక కోర్టు భవన సముదాయంలోని బార్ అసోసియేషన్ హాలులో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎంతో ఆనందోత్సాహాల మధ్య కేకు కట్‌చేసి న్యాయవాదులకు పంచిపెట్టారు. మహిళా న్యాయవాదులందరూ సీనియర్ సివిల్‌జడ్జి ఎం. సుధ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి షేక్. రెహనలకు పూలమాలలువేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరవ రమేష్‌బాబు, వైస్ ప్రసిడెండ్ పివి. విజయలక్ష్మి, సభ్యులు పాల్గొన్నారు.

- సృష్టికి మూలం స్త్రీ అని, స్త్రీ లేనిదే మన మనుగడ లేదని జిల్లా పరిషత్ హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్‌ఎం కె.శ్రీనివాసరావు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం చీరాల రూరల్ మండలం వాడరేవులోని జెడ్పీ హైస్కూల్‌లో కార్యక్రమాన్ని నిర్వహించారు.
- ఇన్నర్‌వీల్ ఆధ్వర్యంలో ప్రభుత్వాసుపత్రిలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ సుభాషిణి, సునీత, కరుణకుమారిని ఘనంగా సత్కరించారు.
- మహిళా దినోత్సవం కొరిశపాడులోని మండల కార్యాలయంలో తహసీల్దార్ సుశీల, ఎంపీడీవో సమత వాణి, సీడీపీవో కృష్ణకుమారి, ఏపీఎం అనూరాధ, ఏపీవో కోటేశ్వరిలను తోటి ఉద్యోగులు శాలువాలతో పూలమాలలతో సన్మానించారు.
- సంతమాగులూరు వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో ఏపీఎం డీ మస్తాన్‌రావు ఆధ్వర్యంలో జాతీయ మహిళా దిన్సోవాన్ని పురస్కరించుకుని మహిళలకు వివిధ ఆటల పోటీలను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైద్యాధికారి డాక్టర్ జ్యోత్స్న, డాక్టర్ సాహిత్య హాజరయ్యారు. పర్చూరు సీడీపీఓ కార్యాలయంలో ముఖ్య అతిథిగా పర్చూరు సీనియర్ సివిల్ జడ్జి కే ప్రశాంతి హాజరై మహిళా చట్టాలు గురించి మహిళలకు ఉచిత న్యాయ సహాయం అనే అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.
- చినగంజాం మండలం మున్నం వారిపాలెం ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం మల్లారెడ్డి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా మధ్యాహ్న భోజన కార్మికురాలు సుబ్బరావమ్మ,రాజమ్మలను సన్మానించారు.
- కారంచేడు మండలంలోని నందిగుంటపాలెం, కారంచేడు, కుంకలమర్రు, స్వర్ణ, దగ్గుబాడు, ఆదిపూడి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో మహిళాదినోత్సవం నిర్వహించారు. అనంతరం ఉపాధ్యాయులను ఘనంగా శాలువాలతో సత్కరించారు. నందిగుంటపాలెంలో హెచ్‌ఎం మారెళ్ల పుష్పలత, పీ రమాదేవి, యు నాగమణి, ఎస్ సుభాషిణి, ఎస్ మమతలను విద్యార్థులు సత్కరించారు.

కొమ్మమూరు కాలువకు తాగునీరు అందించాలి



సమస్యలను అధికారులకు వివరిస్తున్న జెడ్పీటీసీ

కారంచేడు: వేసవి తీవ్రత పెరుగుతున్న కారణంగా కొమ్మమూరు ఆయకట్టులో ఉన్న పొలాలకు సాగునీటితో పాటు, గ్రామాల్లోని తాగునీటి చెరువులను నింపుకోవడానికి అవసరమైన తాగునీటిని కూడా విడుదల చేయాలని కారంచేడు జెడ్పీటీసీ సభ్యురాలు యార్లగడ్డ రజనీశ్రీనివాసరావు జెడ్పీ సమావేశంలో కోరారు. గురువారం ఒంగోలులో నిర్వహించిన ఉమ్మడి ప్రకాశం జెడ్పీటీసీ సభ్యుల సమావేశంలో ఆమె పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కొమ్మమూరు ఆయకట్టు కింద బాపట్ల జిల్లాలో కారంచేడు, చీరాల, పర్చూరు, చినగంజాం, వేటపాలెం మండలాల్లోని అనేక గ్రామాలకు తాగునీటి సరఫరా జరగాల్సి ఉందన్నారు. గ్రామ దేవత గంగమ్మ తల్లి గుడి వద్ద మండపం నిర్మాణం పూర్తి అయినప్పటికీ పెండింగ్‌లో ఉన్న రూ.10లక్షల నిధుల విడుదలకు చర్యలు తీసుకోవాలని రజనీశ్రీనివాసరావు కోరారు. దీంతో సీఈఓ జాలిరెడ్డి స్పందించి త్వరలోనే నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చినట్లు జెడ్పీటీసీ సభ్యురాలు తెలిపారు.